పర్యావరణ (పరిరక్షణ) చట్టం

యూనిట్-1

సిలబస్: పర్యావరణ విభాగాలు, పర్యావరణ పరిరక్షణను పెంపొందించడం, పర్యావరణ (పరిరక్షణ) చట్టం, వాయు (కాలుష్య, నివారణ, నియంత్రణ) చట్టం, జల (కాలుష్య, నివారణ, నియంత్రణ) చట్టం, జల కాలుష్య సుంకం (cess) చట్టం, అటవీ సంరక్షణ చట్టం, పర్యావరణ వాదం.

ఈ పేపర్‌లోని మూడో విభాగంలో అభివృద్ధి, పర్యావరణ సమస్యలు శీర్షికతో ఐదు యూనిట్‌లు ఉన్నాయి. అవి...సహజ వనరులు– తరుగుదల, వాటిపై అభివృద్ధి ప్రభావం, పర్యావరణ (గాలి, జల, భౌమ, శబ్ద) కాలుష్యం, ఆవరణ వ్యవస్థలు, ఆహార శృంఖలాలు, జీవ వైవిధ్య హాట్‌స్పాట్‌లు, ఘన వ్యర్థపదార్థ నిర్వహణ, వాటర్ షెడ్ అభివృద్ధి, పర్యావరణం, మానవ ఆరోగ్యంలో సమాచార సాంకేతిక విజ్ఞానం పాత్ర మొదలైన అంశాలు. ప్రస్తుతం ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్న పర్యావరణ సమస్యలు, కారణాలు, పరిష్కార మార్గాలపై అవగాహన కలిగి ఉండాలి.

గత మెయిన్స్‌లో వచ్చిన ప్రశ్నలు:

- పర్యావరణ భాగాలు లేదా ఖండాలు (సెగ్మెంట్లు) గురించి విపులంగా రాయండి?
- నీటి కాలుష్యం నివారణ, నియంత్రణ చట్టం గురించి రాయండి? పర్యావరణ చట్టాల అమల్లో ఇమిడి ఉన్న అంశాలు ఏమిటి?

మొదటి ప్రశ్నకు జవాబులో పర్యావరణంలోని వివిధ భాగాలు (అట్మాస్ఫియర్, లిథోస్ఫియర్, హైడ్రోస్ఫియర్, బయోస్ఫియర్, మ్యాగ్నెటోస్ఫియర్)ను, వాటి ప్రాముఖ్యాన్ని వివరించాలి. అట్మాస్ఫియర్‌ను సంక్షిప్తంగా ట్రోపోస్ఫియర్, స్ట్రాటోస్ఫియర్, థర్మోస్ఫియర్, ఐనోస్ఫియర్, ఎక్సోస్ఫియర్‌గా కూడా వివరించాలి. రెండో ప్రశ్నలో నీటి కాలుష్య నివారణ నియంత్రణ చట్టంలోని అధ్యాయాలు, వాటి సెక్షన్‌లలోని కీలక అంశాలను, చట్టంలో వివరించిన నిర్వచనాలను తెలియజేయాలి. పర్యావరణంలోని వివిధ భాగాల పరిరక్షణ చట్టాలను రూపొందించినప్పటికీ, వాటి అమల్లో కొన్ని లోపాలను గుర్తించొచ్చు. చట్టం అమలుకు సరిపడే సిబ్బంది, నిధులను సమకూర్చుకోవడంతో పాటు, చట్టాలను అతి క్రమించిన వారిని తప్పనిసరిగా శిక్షించాలి. సామాన్య ప్రజలను కూడా ఇందులో భాగస్వాములను చేయాలి.

పర్యావరణ చట్టాలకు సంబంధించి కింది అంశాల్లో అభ్యర్థులు అధ్యయనం చేయాలి.

- చట్టం దేనికి ఉద్దేశించింది?
- దాని ఆవశ్యకత ఏమిటి?
- చట్టానికి సంబంధించిన ముఖ్యాంశాలు (వాటి అధ్యాయాలు/సెక్షన్‌లు పొందుపరచిన ముఖ్య

నిర్వచనాలు, పెనాల్టీ)

- చట్టం అమలులో ఇబ్బందులు, వాటిని అధిగమించడానికి సూచనలు
- చట్టం అమలు ద్వారా పర్యావరణ పరిరక్షణలో సాధించిన ప్రగతి
- ఇందుకోసం నిర్వహించాల్సిన అధ్యయనం, పరిశోధన

ఒక చట్టానికి సంబంధించిన సమాచారం చాలా ఉంటుంది. దానిలోని అన్ని అంశాలను ప్రతిబింబించే విధంగా సంక్షిప్తంగా సమాచారాన్ని ఇవ్వడం ముఖ్యం.

పర్యావరణ పరిరక్షణ చట్టం ముఖ్యాంశాలు చర్చించండి?

1972 జూన్‌లో స్టాక్‌హోంలో యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ హ్యూమన్ ఎన్విరాన్‌మెంట్ (స్టాక్ హోం కాన్ఫరెన్స్) సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విడుదల చేసిన పర్యావరణ పరిరక్షణ ఆదేశిక సూత్రాల స్ఫూర్తితో భారత ప్రభుత్వం 1986లో పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా పర్యావరణంలోని వివిధ భాగాలు ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రమాదాలను నిర్మూలించడానికి ఈ చట్టం కృషి చేస్తుంది.

ఈ చట్టంలో మొత్తం 4 అధ్యాయాలున్నాయి. మొదటి అధ్యాయం 1, 2 సెక్షన్‌లలో చట్టం పరిధి, విస్తరణ, ముఖ్యమైన పదాలను వివరించారు. ఈ చట్టం దేశవ్యాప్తంగా అమలులో ఉంటుందని మొదటి సెక్షన్‌లో వివరించారు. పర్యావరణం, పర్యావరణ కాలుష్యం, కాలుష్య కారకాలు మొదలైన పదాలను రెండో సెక్షన్‌లో నిర్వచించారు.

రెండో అధ్యాయంలోని 3-6 సెక్షన్‌లలో పర్యావరణ పరిరక్షణ, పర్యావరణ స్థితిగతులను మెరుగు పరచడానికి కేంద్ర ప్రభుత్వ అధికారాలు, పర్యావరణ పరిరక్షణకు అధికారుల నియామకం, వారి అధికారాలు, విధులను పొందుపరిచారు.

మూడో అధ్యాయంలోని 7-17 సెక్షన్‌లలో కింది అంశాలను వివరించారు.

- నిర్ణయించిన పరిమితికి మించి పరిశ్రమల నుంచి కాలుష్య ఉద్గారాలను విడుదల చేయకూడదు. హానికర పదార్థాల రవాణా, వినియోగం, భద్రపరిచినపుడు తీసు కోవాల్సిన సురక్షిత చర్యలు.
- కేంద్ర ప్రభుత్వం నియమించిన అధికారులకు ఎపుడైనా, ఏ పరిశ్రమనైనా తనిఖీ చేసే అధికారం.
- అధికారులు ఎప్పటికప్పుడు తాము చేపట్టిన చర్యలపై నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించడం.
- చట్టంలోని పరిమితులు, ఇతర అంశాలను అతిక్రమించిన వారికి ఐదేళ్ల కారాగార శిక్ష లేదా లక్ష రూపాయల జరిమానా లేదా రెండూ విధించే అవకాశం.

  నాల్గో అధ్యాయం 18-26 సెక్షన్‌లలో ఇతర అంశాలను (Miscellaneous) వివరించారు. వీటిలో ముఖ్యమైనవి.
- విధులను నిర్వహించే అధికారులకు రక్షణ కల్పించడం.

- రాష్ట్ర ప్రభుత్వాల సంస్థలు లేదా విభాగాల నుంచి లేదా రాష్ట్ర అధికారుల నుంచి కావలసిన సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకోవడం.

అటవీ సంరక్షణ చట్టం – ముఖ్యాంశాలు:

దేశవ్యాప్తంగా అటవీ సంరక్షణ కోసం 1980లో అటవీ సంరక్షణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. స్వాతంత్ర్యానికి ముందు ఉన్న 1927 చట్టాన్ని సవరిస్తూ ఈ చట్టాన్ని రూపొందించారు. 1988లో కూడా ఒకసారి సవరించారు. ఈ చట్టంలోని ఐదు సెక్షన్‌లలో అమలుకు సంబంధించిన విషయాలతో పాటు చట్టం పరిధిని వివరించారు.

మొదటి సెక్షన్‌లో చట్టం పరిధిని వివరించారు. జమ్మూ–కాశ్మీర్ తప్ప దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఈ చట్టం అమలవుతుంది.

రెండో సెక్షన్‌లో అటవీ భూములను వాణిజ్య అవసరాలకు వినియోగించడాన్ని నియంత్రించే, నివారించే అంశాలను చేర్చారు. ఈ సెక్షన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా కింది చర్యలను ఏ రాష్ట్రం ప్రభుత్వం కూడా చేపట్టరాదు.

- రిజర్వు ఫారెస్ట్‌లను అన్ రిజర్వుడుగా ప్రకటించడం.
- అటవీ సంరక్షణ చర్యలు నిర్వహించడం.
- ఏదైనా సంస్థకు అటవీ భూములను లీజుకివ్వడం.
- అటవీ ప్రాంతాల్లో చెట్లను నరకడం, వాణిజ్య కార్యకలాపాలను నిర్వహించడం.
- టీ, కాఫీ, మసాలా దినుసులు, రబ్బరు, ఔషధ మొక్కల పెంపకం
- ఆనకట్టలు, బ్రిడ్జ్‌లు, చెక్‌పోస్టులను నిర్మించడం.

మూడో సెక్షన్‌లో భాగంగా అడవుల పరిరక్షణ కోసం ఎప్పటికప్పుడు సూచనలిచ్చే సలహా కమిటీలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు.

నాల్గో సెక్షన్‌లో ఈ చట్టం అమలుకు సంబంధించిన వివిధ నియమాలను కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు నోటిఫికేషన్ ద్వారా జారీ చేయవచ్చని వివరించారు.

ఐదో సెక్షన్‌లో ఈ చట్టానికి సంబంధించి తొలుత విడుదలైన ఆర్డినెన్స్ రిపీలు(వెనుకకు తీసుకోవడం)ను పొందుపరిచారు.

ఈసారి మెయిన్స్‌కు ప్రిపేరవుతున్న అభ్యర్థులు కచ్చితంగా చదువుకోవాల్సిన అంశం పర్యావరణ వాదం. పర్యావరణ వాదం అంటే ఏమిటి? పర్యావరణ వాదం లక్ష్యాలు? దాని ఆవిర్భావం, అభివృద్ధి ఎలా సాగింది? భారత్‌లో పర్యావరణ వాదం అభివృద్ధి చెందిన విధానం, సాధించిన ప్రగతి? భారత్‌లో పర్యావరణ వాదాన్ని బలపరిచింది, అనేక ఇతర పర్యావరణ ఉద్యమాలకు ఊపిరి పోసింది చిప్‌కో ఉద్యమం. ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా ప్రజలు, పాలకుల్లో పర్యావరణంపై అవగాహనను పెంపొందించింది. 1973లో చమోలీలో మొదలైన ఈ ఉద్యమం 1980 నాటికి ఉత్తరాంచల్‌లో

హిమాలయాలంతటా వ్యాపించింది. 1980 మొదలుకొని, 15 ఏళ్ల వరకు ఉత్తరప్రదేశ్ అడవుల్లో చెట్లను నరకడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వును సాధించడం ఈ ఉద్యమం విజయం. అనేక మంది పర్యావరణ వేత్తలను కూడా ఈ ఉద్యమం మనకు అందించింది.